సాక్షి
జనగామ

శుక్రవారం | 23 | ఆగస్టు | 2024



ఆర్టీసీలో సెమీ డీలక్స్ బస్సులు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం సెమీ డీలక్స్ బస్సులను ప్రవేశ పెట్టింది. ఇందులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండదు. - 8లో



ప్రజా ఉద్యమాలతోనే పార్టీ పటిష్టం

ప్రజాఉద్యమాలతోనే పార్టీ పటిష్టమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సమస్యలున్నచోట ప్రజలకు కమ్యూనిస్టులు గుర్తుకు రావాలని పేర్కొన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గుతాయి.

న్యూస్‌రీల్

విద్యార్థుల హాజరు తగ్గొద్దు



బచ్చన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువ ఉండొద్దు.. ఇందుకు హెచ్‌ఎంలు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్, చిన్నరామన్‌చర్ల, పడమటికేశ్వాపూర్, కొన్నె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడానికి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని, వారికి ఇష్టమైన రంగాలను ఎంచుకునే అవకాశం కల్పించాలని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలని అన్నారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఏఓగా రామారావునాయక్



జనగామ రూరల్: జిల్లా వ్యవసాయ అధికారిగా నకిరేకల్‌కు చెందిన రామారావునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వినోద్‌కుమార్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

డీఎస్‌ఓగా సరస్వతి



జిల్లా పౌరసరఫరాల అధికారిగా సరస్వతి బాధ్యతలు చేపట్టారు. ఆ పోస్టులో ఇక్కడ సుదీర్ఘ కాలం పని చేసిన రోజరాణి భువనగిరి యాదాద్రి జిల్లాకు బదిలీ అయ్యారు. మెడ్చల్ జిల్లా ఖైరతాబాద్ ఏసీఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సరస్వతి డీఎస్‌ఓగా వచ్చారు.

డీఎంగా హథీరామ్..



జిల్లా సివిల్ సప్లయ్ డీఎంగా హథీరామ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసే ప్రసాద్ సూర్యాపేటకు బదిలీగా.. జగిత్యాల నుంచి హథీరామ్ జనగామకు వచ్చారు.

ఏఎస్‌ఓగా ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్..



జిల్లా ఏఎస్‌ఓగా ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ జనగామకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ జిల్లా పౌరఫరాల శాఖలో ఏసీఎస్‌ఓగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. శుక్రవారం విధుల్లో చేరనున్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య విద్యార్థినుల హాస్టల్

జనగామ: జిల్లాలోని మెడికల్ కళాశాల విద్యార్థినుల హాస్టల్ కోసం జనగామ మండలం శామీర్‌పేట శివారులోని కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమం కేటాయిస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు గురువారం తెలిపారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థినులకు పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ వసతి గృహం కేటాయించగా.. ప్రస్తుతం కౌన్సిలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వృద్ధాశ్రమాన్ని తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థినులు ఓల్డేజ్ హోంలో ఉండడంతో వృద్ధులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా కేంద్రంలో నూతన కళాశాల, హాస్టల్ భవన నిర్మాణాలు పూర్తయిన వెంటనే అందులోకి మారుతామని ఈ సందర్భంగా వివరించారు.

కళాకారులను కాపాడుకోవాలి



జనగామ రూరల్: సమాజ రుగ్మతలను రూపుమాపడానికి జానపద కళాకారుల కృషి అభినందనీయమని, కళాకారులను కాపాడుకోవాలని డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో జిల్లా జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జానపదాలు సమాజం ఉన్నంతకాలం జీవించే ఉంటాయన్నారు. జానపద సాంస్కృతిక కళలు, కళారూపాలు మానవ శ్రమ నుంచి పురుడు పోసుకొని మానవ వికాసానికి దోహదపడ్డాయని చెప్పారు. సంఘం అధ్యక్షుడు ఊర సంపత్, నాయకులు కాసర్ల రమేష్, రేణుక, లక్ష్మీనారాయణ, సంపత్, రఘునాథపల్లి మండలం అధ్యక్షుడు మారపాక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ సేవలు.. అందని ద్రాక్షేనా..?

ఎంజీఎంలో కేంద్రం ఏర్పాటు ప్రకటనకు మూడేళ్లు

- ఏడాదిన్నర క్రితం ఆస్పత్రిని పరిశీలించిన రాష్ట్ర వైద్యాధికారులు
- ఆ తరువాత అడుగు కూడా ముందుకు పడని వైనం
- సెంటర్ ప్రారంభిస్తే పిల్లలు లేని పేద దంపతులకు ఉచితంగా సేవలు
- రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి



సాక్షి, వరంగల్:

పిల్లలు లేని నిరుపేద దంపతులకు ఉచితంగా వైద్యసేవలందించేందుకు వరంగల్ మహాత్మా గాంధీ మెమోరియల్ ఆస్పత్రిలో ఇన్ విట్రో ఫర్టిలైజేషన్(ఐవీఎఫ్) కేంద్రం ఏర్పాటుచేస్తామన్న హామీకి మూడేళ్లు నిండాయి. అయినా ఆ దిశగా ఏ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో పేద దంపతులు బయట అప్పులు తెచ్చి మరీ ప్రైవేట్ సంతాన సాఫల్యకేంద్రాల చుట్టూ తిరుగుతూ లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆహారపు అలవాట్లు, ఇతరత్రా కారణాలతో దంపతుల్లో సంతానలేమి సమస్యలు వస్తున్నాయి. ఫలితంగా పిల్లల కోసం ఆరాటపడే వారి సంఖ్య పెరుగుతుండడంతో అందుకనుగుణంగా వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని ట్రై సిటీలో సంతాన సాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయి. ఆర్థికంగా లేకున్నా అప్పులు చేసి మరీ నెలలకొద్దీ వీటి చుట్టూ తిరుగుతుండడంతోపాటు ఇంట్రా యుటిరైన్ ఇన్ సెమినేషన్ (ఐయూఐ), ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ (ఐవీఎఫ్) పద్ధతుల్లో పిల్లలకు జన్మనిచ్చేలా చేస్తామంటూ రూ.లక్షలు దండుకుంటున్నాయి.

2018, ఆగస్టులో ప్రకటన..

పిల్లలు లేని పేద దంపతుల బాధలను గుర్తించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2018, ఆగస్టు 30న సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా వరంగల్ ఎంజీఎంలోనూ ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభిస్తామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగానే ఎంజీఎంలోని తొలి అంతస్తులో మదర్ అండ్ చైల్డ్ సెంటర్ (ఎంసీహెచ్)తో పాటు ఇది ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్యారోగ్య విభాగాధికారులు ఏడాదిన్నర క్రితం పర్యటించి అన్ని ఏర్పాట్లు చేశారు. అయినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఇది ప్రారంభమైతే వందలాదిమంది పేద దంపతులకు ఉచితంగా ఐవీఎఫ్ సేవలు అందుతాయి. ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగి రూ.లక్షలు ఖర్చుపెట్టే వ్యయప్రయాస తగ్గుతుంది. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని 27 సంతాన సాఫల్య కేంద్రాల్లో ఏటా రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతున్నదనే చర్చ వైద్యశాఖలో ఉంది.

ఎంజీఎంనే ఎందుకంటే...

ఇప్పటికే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఓపీ సేవలనుంచి రక్త పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు అన్నీ ఒకే చోట ఉండడంతో దంపతులకు సులువుగా వైద్య సేవలందుతున్నాయి. పిల్లలు లేని దంపతులు ఫెర్టిలిటీ వైద్యం కోసం ముందుగా ఓపీలో గైనకాలజీ విభాగం వైద్యులను సంప్రదిస్తే, అక్కడే ఉన్న సెంట్రల్ ల్యాబ్‌లో అన్ని టెస్టులు ఉచితంగా చేస్తున్నారు. సంతానం కోసం అన్ని టెస్టులు చేయించుకున్నా పిల్లలు కలగకపోతే ఐవీఎఫ్ టెస్టు చేస్తున్నారు. ఇందుకోసం రూ.ఐదు కోట్లతో యంత్రాన్ని తీసుకొచ్చారు. ఈ మాదిరిగానే ఉత్తర తెలంగాణకు పెద్ద ఆస్పత్రిగా ఉన్న ఎంజీఎంలో ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభించాలని నిర్ణయించారు. వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్, హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, జగిత్యాల తదితర జిల్లాలనుంచి వచ్చే పిల్లలు లేని దంపతులకు పైసా ఖర్చు లేకుండా ఉండేది. ఇంకా ప్రారంభం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ సంతాన సాఫల్య కేంద్రాలకు వెళ్లి రూ.లక్షల్లో ఫీజు చెల్లిస్తున్నారు. దీనిపై ఎంజీఎం సూపరింటెండెంట్ మురళిని వివరణ కోరగా ఆస్పత్రిలో ఐవీఎఫ్ కేంద్రం ఏర్పాటు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకు అవసరమైన యంత్రం కూడా వచ్చిందన్నారు. త్వరలోనే సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

వైద్యసేవలు ఇలా..

ఇది రెండు పద్ధతుల్లో ఉంటుంది. ఒకటి ఇంట్రా యుటిరైన్ ఇన్ సెమినేషన్ (ఐయూఐ). అంటే భర్త నుంచి సేకరించిన వీర్యాన్ని ల్యాబ్‌లో శుద్ధి చేసి భార్య అండాశయంలోకి ప్రవేశపెడతారు. రెండోది ఇన్ విట్రో ఫర్టిలైజేషన్ (ఐవీఎఫ్). ఈ పద్ధతిలో ల్యాబ్ లోనే పిండాన్ని ఫలదీకరణ చేశాక మహిళ గర్భంలో ప్రవేశపెడతారు. ఒక్కో జంటకు రెండు నుంచి మూడు నెలల సమయం తీసుకుంటుంది. ఐయూఐతో పోల్చితే ఇది చాలా ఖర్చుతో కూడుకున్న చికిత్స. ప్రైవేట్‌లో రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది' అని వైద్యులు తెలుపుతున్నారు.

29న జిల్లాకు రాష్ట్ర గవర్నర్ రాక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్ తదితరులు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 29న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా జిల్లా కేంద్రంలో రోడ్ల పరిశుభ్రత, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం రూట్‌మ్యాప్ తయారు చేసి ఫ్లెక్సీలు రూపొందించాలని చెప్పారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై నోట్స్ సమర్పించాలని, స్వయం సహాయక సంఘాలు, పెంబర్తి హస్తకళలపై కలెక్టరేట్‌లో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్‌లు, భోజన వసతులు, తాగునీరు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలని, ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, జెడ్పీ సీఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన వివరాలు ఇలా..

ఉదయం 9 గంటలకు వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అఫీషియల్స్‌తో సమావేశం అనంతరం 10 గంటలకు జనగామకు చేరుకుంటారు. 10 నుంచి 11.15 గంటల వరకు కలెక్టరేట్‌లో అఫీషియల్స్‌తో సమావేశం, 11.15 నుంచి 11.35 గంటల వరకు జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ గ్రామానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లాలోని కవులు, కళాకారులకు ఎమినెంట్ పీపుల్స్ రాష్ట్ర స్థాయి అవార్డులు అందజేస్తారు. మధ్యాహ్న భోజనం అనంతరం భువనగిరి యాదాద్రి జిల్లా కొలనుపాక దేవాలయానికి బయలుదేరి వెళ్లనున్నారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

- స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ

లింగాలఘణపురం: యువత వ్యసనాలకు బానిస కావొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ అన్నారు. గురువారం వడిచర్లకు చెందిన సాతెల్లి కార్తీక్ అనే యువకుడి వద్ద గంజాయి లభించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో కొంత మంది డబ్బు సంపాదనే ధ్యేయంగా యువకులకు చెడు అలవాట్లు నేర్పుతున్నారని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్తీక్ చదువుకుంటున్న సమయంలోనే నవాబుపేటకు చెందిన మణికంఠ అనే స్నేహితుడితో గంజాయి అలవాటు చేసుకుని చదువులో ఫెయిల్ అయ్యాడని చెప్పారు. ఆ తరువాత తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లినా గంజాయి కోసం వెతికి దూల్పేట నుంచి తెచ్చుకుని బానిసయ్యాడని, 75 గ్రాముల గంజాయితో పట్టుబడినట్లు చెప్పారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



నిందితుడు కార్తీక్‌తో ఏసీపీ, సీఐ, ఎస్సై

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి.. డెంగీ జ్వరాలు ఉన్నచోట వైద్య పరీక్షలు చేయించాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం మున్సిపాలిటీ పరిధి ధర్మకంచలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యాధికారితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందితోపాటు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలని, ఔట్ పేషంట్ల సంఖ్య నమోదు పెంచాలన్నారు. అనంతరం మినీస్టేడియాన్ని సందర్శించి ఇండోర్ స్టేడియంలో ఖేలో ఇండియా నిర్వహణకు కల్పించనున్న సౌకర్యాలను జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటరెడ్డితో కలిసి పర్యవేక్షించారు.



యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

రూ.50 కోట్లతో రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: త్వరలో రూ.50 కోట్లతో రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం నూతనంగా ఒకే చోట నాలుగు గురుకుల పాఠశాలలు(రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్) ఏర్పాటు చేయనుందని, నియోజకవర్గంలో అవకాశం కల్పించాలని సీఎంతో పాటు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేట, శంకర్‌తండా సమీప ప్రధాన రహదారిని అనుకుని ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని, నెలరోజుల్లో రూ.210కోట్లు మంజూరు కానున్నాయని అన్నారు. తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బేబిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

డెంగీపై అప్రమత్తంగా ఉండండి

- వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి
- అత్యవసర సమయంలో మందులు కొనుగోలు చేయాలి
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో అడ్డగోలు దోపిడీని సహించేది లేదు
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వెల్లడి

జనగామ: డెంగీపై అప్రమత్తంగా ఉండాలి.. జిల్లాలో ప్రాణాపాయం ఉండ కూడదు.. స్పెషలిస్టు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి.. అత్యవసరమైతే ప్రైవేటుగా మందులు కొనుగోలు చేసి ప్లేట్‌లెట్స్ కొరత రాకుండా చూడాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్), రెండు ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆస్పత్రుల్లోని జనరల్, చిన్న పిల్లల వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితి, డెంగీ కేసుల గురించి తెలుసుకున్నారు. 'ప్లేట్‌లెట్స్ పెరుగుతున్నాయి.. ఆందోళన వద్దు.. పండ్లు, రసాలు ఎక్కువగా తీసుకోవాలి' అని పేషెంట్లలో భరోసా కల్పించారు. న్యూట్రీషియన్‌కు సంబంధించి ప్రత్యేక నిపుణులు అందుబాటులో ఉండి ఆహార నియమావళిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉండి చికిత్స పొందుతున్న పేషెంట్లను రోజుకు మూడు సార్లు పరీక్షించాలని చెప్పారు. ఆస్పత్రిలోని రోగుల వివరాల నివేదికను ప్రతిరోజూ సాయంత్రం తనకు పంపించాలన్నారు. మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి(ఎంసీహెచ్)లో డెంగీ బారిన పడి అడ్మిట్ అయిన చిన్నారుల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఎంసీహెచ్ పిల్లల వార్డులో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

ప్లేట్‌లెట్స్ కొరత ఉండొద్దు

డెంగీతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్లేట్‌లెట్స్ కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా ప్లేట్‌లెట్స్ తగ్గితే వెంటనే సమీప ఆస్పత్రుల్లో చేరాలని సూచించారు. చిన్న పిల్లల విషయంలో అలసత్వం వహించొద్దని చెప్పారు. డెంగీకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖలను సమన్వయం చేస్తూ ప్రత్యేక వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశామని, క్షేత్ర స్థాయిలో జరిగే ప్రతీ సమాచారం తెలుసుకుంటున్నట్లు వివరించారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే పేషెంట్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని సహించేది లేదు

డెంగీతో పాటు ఇతర వైద్యం విషయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజుల వసూలులో అడ్డగోలు దోపిడీని సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. డెంగీకి వైద్య ఖర్చుల వివరాలను ఆస్పత్రుల్లోని బోర్డ్‌పై డిస్‌ప్లే చేయాలని, నిబంధనల మేరకు రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.



జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

జిల్లాలో 16 డెంగీ కేసులు

జిల్లాలో ప్రస్తుతం 16 డెంగీ కేసులు ఉండగా.. జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అడ్మిట్ అయిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారిపై అదనపు పర్యవేక్షణకు డాక్టర్లను కోరినట్లు పేర్కొన్నారు. ప్లేట్‌లెట్స్ లక్షలోపు పడిపోయిన వారు వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పంచాయతీ సెక్రెటరీ, ఎంపీడీఓ, ఎంపీఓలు సంయుక్తంగా డెంగీ నివారణకు గ్రామాల వారీగా శానిటేషన్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో లిఫ్టు ఏర్పాటు, ఎంసీహెచ్ ఓపీ వార్డులో పైనుంచి ఎండ వేడిమి తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

రుణమాఫీపై ప్రభుత్వం మెడలు వంచుతాం

- రేవంత్ నిజ స్వరూపం బయటపడింది..
- ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు

జనగామ : ప్రభుత్వం మెడలు వంచి ప్రతీరైతుకు రుణమాఫీ వర్తింప జేసేవరకు బీఆర్‌ఎస్ రైతులకు అండగా ఉంటుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పంట రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని, ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన ఆందోళనలు చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా పోలీస్ కంట్రోల్ రూం ఏరియాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం.. బ్యాంకులకు వెళ్లి రెండు లక్షల రుణం తెచ్చుకోండి.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని పరుగులు పెట్టించిన రేవంత్‌రెడ్డి నిజస్వరూపం బయట పడిందన్నారు. 49లక్షల మందికి పంట రుణం మాఫీ కావాల్సి ఉండగా, 22 లక్షల మందికి మాత్రమే మాఫీ అయిందన్నారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయ స్థిరీకరణతో పాటు 11 విడతల్లో రూ.70వేల కోట్లు రైతుబంధు ఇచ్చారన్నారు. పోలీసులు తుంగతుర్తి ఎమ్మెల్యే, పార్టీ అనుచరులపై దాడి చేసే ప్రయత్నం చేశారని, ఇలాగే ఇబ్బంది పెడితే భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇంతటి అణిచివేత చూడలేదు, కానీ రేవంత్ రెడ్డి సర్కార్ తీవ్రంగా అణిచివేతకు గురిచేస్తున్నదన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వానాకాలం సాగు చేసిన పంటలు కరువుతో ఎండిపోతుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రిజర్వాయర్లతో పాటు తపాస్‌పల్లి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి అక్కడి నుంచి చెరువులను నింపి సాగు నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. రెండ్రోజులు చూసి ప్రభుత్వం స్పందించకుంటే బచ్చన్నపేట పరిధిలో పైపులు బద్దలు కొట్టి సాగునీరు తీసుకుపోతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, మాజీ ఎంపీపీ మేకల కలింగరాజు, నాయకులు, ప్రజాప్రతినిధులు దేవీప్రసాద్, క్యామ మల్లేశం, ఏనుగు రాకేష్‌రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, మేకల రాంప్రసాద్, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, సిద్దిలింగం, మసిఉర్ రెహమాన్, కిష్టయ్య, ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్లకార్డుల తో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా, దేవీప్రసాద్, క్యామ మల్లేశం తదితరులు

- మరిన్ని చిత్రాలు 9లో

పత్తి సాగులో సస్యరక్షణ అవసరం

పాలకుర్తిటౌన్: పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు అవసరమని వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఉమారెడ్డి తెలిపారు. జాగృతి ప్రాజెక్టులో భాగంగా ఈరవెన్ను గ్రామంలో దేశ్‌పాండే, బేయర్ క్రాప్‌సైన్స్ కంపెనీల ఆధ్వర్యాన పత్తి సాగులో యాజమాన్య పద్ధతులపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పత్తిలో గులాబీ పురుగు ఉనికిని గమనించేందుకు లింగాకర్షక బుట్టలు అమర్చాలన్నారు. 10 శాతం గడ్డిపూలు, 10 శాతం పురుగు పంటను ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ జి.వీరన్న, రాజశేఖర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈరవెన్నులో మాట్లాడుతున్న డాక్టర్ ఉమారెడ్డి

లింగాకర్షక బుట్టల పంపిణీ..

తరిగొప్పుల: స్థానిక రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన సదస్సులో తెలంగాణ పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.వీరన్న, భువనగిరి ఏరువాక కేంద్రం సంచాలకులు డాక్టర్ బి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు.

ఆక్యుపెన్సీ రేషియో పెంచడం అభినందనీయం

జనగామ రూరల్: ఉద్యోగులు, సిబ్బంది ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో పెంచడం అభినందనీయమని స్థానిక డిపో మేనేజర్ స్వాతి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈనెల 18 నుంచి 21 వరకు జనగామ డిపో రోజూ 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో సాధించడంతో ఆదాయం పెరిగిందన్నారు. ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ మిఠాయిలు పంచి ఉద్యోగులను అభినందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది

ముగిసిన పొట్ట పండుగ



అమ్మవార్ల గద్దెల నుంచి సమ్మక్క గుడికి వస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో పొట్ట పండుగ పూజా కార్యక్రమాలు ముగిశాయి. బుధవారం రాత్రి సమ్మక్క గుడి నుంచి పసుపు, కుంకుమ, పూజాసామగ్రి, కొత్తగా పొట్టకు వచ్చిన ధాన్యాలను తీసుకుని పూజారులు సమ్మక్క– సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లారు. అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రింతా జాగారాలతో సంబురాలు చేసుకున్న పూజారులు.. గురువారం ఉదయమే గద్దెల నుంచి సమ్మక్క గుడికి చేరుకున్నారు. గుడిలో అమ్మవారికి పొట్టకు వచ్చిన ధన్యాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అమ్మవారికి సమర్పించిన తర్వాత పూజారులు కొత్త ధాన్యాలు స్వీకరించారు. రెండు రోజులు జరిగిన పొట్ట పండుగ పూజా కార్యక్రమాలతో మేడారంలో సందడి కనిపించింది.

ముంబయిలో నష్కల్ యువకుడి మృతి



వినయ్(ఫైల్)

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ వినయ్‌కుమార్‌గౌడ్(35) బుధవారం ముంబయిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రులు వడ్లకొండ శంకర్, మణెమ్మ కథనం ప్రకారం.. వినయ్‌కుమార్ గౌడ్ ఆరునెలల క్రితం మిత్రులతో కలిసి ముంబయి వెళ్లాడు. 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి ముంబయి వెళ్లాడు. ఈ సమయంలో ముంబయిలో తాను బాగానే ఉన్నానని తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున అక్కడ ఉండే తమ బంధువులు.. వినయ్‌కుమార్ గౌడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా, ముంబయి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం రాత్రి విమానంలో హైదరాబాద్‌కు పంపారు. శుక్రవారం వినయ్‌కుమార్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహిస్తామని తల్లిదండ్రులు రోదిస్తూ తెలిపారు.

జ్వరంతో పాతతండాలో వ్యక్తి..



చీన్యా(ఫైల్)

కేసముద్రం: జ్వరంతో బాధపడుతున్న ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో చోటుచేసుకుంది. తండావాసుల కథనం ప్రకారం..పాతతండాకు చెందిన ఇస్లావత్ చీన్యా(65) జీపీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చీన్యాకు పదిహేను రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో స్థానిక వైద్యుల వద్ద చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య రంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా 'సాక్షి'లో ఈనెల 18న 'మంచంపట్టిన పాతతండా' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.



ఆర్టీసీలో సెమీ డీలక్స్

వరంగల్ రీజియన్‌కు నాలుగు బస్సులు
- మహిళా ప్రయాణికుల ఒత్తిడి తట్టుకునేందుకు మధ్యేమార్గం
- వరంగల్–2 డిపోనకు కేటాయింపు
- ఉచిత ప్రయాణానికి నో ఛాన్స్



వరంగల్–2 డిపోనకు అలాట్ చేసిన సెమీ డీలక్స్ బస్సు



బస్సు లోపలి భాగం

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో ఈ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసి నడుస్తున్నాయి. అయితే చార్జీలు చెల్లించి వెళ్లే పురుష ప్రయాణికులకు ఈ బస్సులో ఏ మాత్రం అవకాశం లభించడం లేదు. ఫలితంగా వారు డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించాల్సిన తప్పనిసరి పరిస్థితులు నెలకొన్నాయి. సామాన్య ప్రజానీకానికి డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించే స్థితి ఉండదు. అలాగే, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లోనూ ఎక్కలేని పరిస్థితులున్నాయి. దీంతో పురుష ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆర్టీసీ.. ప్రయాణికులను దూరం చేసుకోవద్దనే ఆలోచనతో మధ్యే మార్గంగా సెమీ డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టింది. ఇందులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండదు. చార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

ఎక్స్‌ప్రెస్ కంటే ఎక్కువ, డీలక్స్ కంటే తక్కువ చార్జీ..

ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచినా వాటికి ఉచిత ప్రయాణం కల్పించాల్సిన తప్పనిసరి పరిస్థితుల్లో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ఆర్టీసీ.. సెమీ డీలక్స్ బస్సులు తీసుకొచ్చింది. ఎక్స్‌ప్రెస్ కంటే చార్జీ కొంచెం ఎక్కువ, డీలక్స్ బస్సు కంటే తక్కువ చార్జీ వర్తింపజేస్తూ వీటిని ప్రవేశపెట్టారు. వరంగల్ రీజియన్‌కు ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం నాలుగు సెమీ డీలక్స్ బస్సులు కేటాయించింది. వీటిని వరంగల్ రీజియన్ వరంగల్–2 డిపోకు అలాట్ చేసింది. వీటితో పాటు త్వరలో రానున్న ఎలక్ట్రిక్ బస్సుల్లోనూ సెమీ డీలక్స్ బస్సులు కావాలని వరంగల్ రీజియన్ అధికారులు కోరారు. ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులు ఎక్కువ సంఖ్యలో తిరిగే రూట్లలో నడపాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రధానంగా వరంగల్–2 డిపో పరిధిలో హనుమకొండ–ఏటూరునాగారం రూట్‌లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే నడుస్తాయి. దీంతో ఈ రూట్‌లో పురుష ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రయాణికులు ఆర్టీసీ నుంచి దూరంకాకుండా సెమీ డీలక్స్ బస్సులు నడపాలని చూస్తోంది. ఈ క్రమంలోనే ముందుచూపుతో నాలుగు సెమీ డీలక్స్ బస్సులను వరంగల్–2కు యాజమాన్యం అలాట్ చేసింది. హనుమకొండ–ఏటూరునాగారం, హనుమకొండ–భూపాలపల్లి–కాళేశ్వరం రూట్‌లో నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్‌ను పోలిన సెమీ డీలక్స్..

సెమీ బస్సు లోపలి భాగం ఎక్స్‌ప్రెస్‌ను పోలి ఉంటుంది. డీలక్స్, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులకు రెండు వైపు రెండు సీట్లు ఉంటాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఒక వైపు, మరో వైపు రెండు సీట్లు ఉంటాయి. సెమీ డీలక్స్ బస్సులోనూ ఒక వైపు మూడు, మరో వైపు రెండు సీట్లు ఉంటాయి. కాగా, ఎక్స్‌ప్రెస్ బస్సు సీట్లు రెగ్జిన్‌తో తయారు చేస్తారు. సెమీ డీలక్స్ బస్సుల సీట్లు డీలక్స్ బస్సులోని సీట్ల మాదిరి ఫ్యాబ్రిక్ క్లాత్‌తో తయారు చేస్తారు. సీట్ల మోడల్‌లో కొద్ది పాటి తేడా మినహా లోపలి భాగం ఎక్స్‌ప్రెస్ బస్సును పోలి ఉంటుంది.

మధ్యస్థంగా చార్జీలు

సెమీ డీలక్స్ బస్ చార్జీలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా మధ్యస్థంగా ఉంటాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుకు కిలో మీటర్‌కు రూ.1.26 చార్జీ ఉండగా డీలక్స్ బస్సుకు రూ.1.44 ఉంది. ఈ రెండింటికి మధ్యస్థంగా ఎక్స్‌ప్రెస్ కంటే కొంచెం ఎక్కువ, డీలక్స్ కంటే కొంచెం తక్కువ చార్జీ కిలో మీటర్‌కు రూ.1.37గా నిర్ణయించారు.

ప్రయాణికులు ఆర్టీసీని వదిలి వెళ్లొద్దు..

ప్రయాణికులు ఆర్టీసీని వీడి వెళ్లొద్దు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో కొందరికి ఎదురవుతున్న అసౌకర్యాన్ని ఆర్టీసీ గుర్తించింది. అలాంటి వారికి సౌకర్యవంతమైన రవాణ కల్పించేందుకు ముందుకొచ్చింది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారం పడుకుండా సెమీ డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టింది. ఈ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం లేదు. చార్జీ చెల్లించి ప్రయాణించే వారి కోసం ఈ బస్సులు నడుపుతున్నాం.

డి.విజయభాను
ఆర్ఎం, వరంగల్

హనుమకొండ నుంచి చార్జీల వివరాలు..
ఇలా ఉండనున్నాయి (చార్జీలు రూ.లలో)

రూట్	కిలో మీటర్లు	చార్జీలు ఎక్స్‌ప్రెస్	సెమీ డీలక్స్	డీలక్స్
ఏటూరునాగారం	111	160	180	190
మంగపేట	129	190	200	210
భూపాలపల్లి	69	100	110	110
కాళేశ్వరం	121	160	180	190

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- రూ 1.34 కోట్లు స్వాధీనం
- నకిలీ ఐడీ కార్డులు, చెక్కులు స్వాధీనం

వరంగల్ క్రైం : షేర్ మార్కెట్, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి నకిలీ ఐడీ కార్డులు, ప్రెస్ కార్డు, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఐడీ కార్డు, నకిలీ ఆధార్, పాన్ కార్డులు, గోల్డ్ రింగ్, నకిలీ బ్యాంకు చెక్కులు, రూ.7,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన నిమిత్ కాపాసి అలియాస్ అమిత్‌కుమార్ షా, హనుమకొండ సాయినగర్ కాలనీకి చెందిన సుమన్ కాపాసి అలియాస్ కాసోజు జయ.. వివిధ కంపెనీలలో ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు కాజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, మహారాష్ట్రలోని పూణె, తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్‌తో పాటు వివిధ నగరాలలో నకిలీ (సీబీఐ, బ్యాంకు మేనేజర్ కార్డులు) ఐడీ కార్డులు చూపుతూ హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ, బెంగాలీ భాషల్లో అనర్గలంగా మాట్లాడుతూ అమాయకులను పరిచయం చేసుకుంటున్నారు. అనంతరం షేర్ మార్కెట్, వివిధ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ బాధితుల నుంచి రూ. 1.34 కోట్లు వసూలు చేశారు. తాజాగా జులైవాడకు చెందిన సయ్యద్ రియాజ్, ప్రవీణ్ కుమార్‌కు స్పీకింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, మ్యాట్రిమోనీ ఓవర్సీస్ కన్సల్టెన్సీ బ్యాంకు లోన్స్ విభాగంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత డబ్బు వసూలు చేశాడు. ఈ డబ్బుతో గురువారం పారిపోతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి పోలీసులు సుబేదారిలో అరెస్టు చేసినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

నిట్‌లో అలరించిన మ్యూజికల్ నైట్



వీణా వందన ట్రూప్ ప్రదర్శన

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన 'స్పిక్ మే కే' మ్యూజికల్ నైట్ అలరించింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందజేసేందుకు, యువతకు శాస్త్రీయ సంగీతం పరిచయం చేసేందుకు ఏటా నిట్ వరంగల్‌లో 'స్పిక్ మే కే' పేరిట మ్యూజికల్ నైట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది వీణా వందన ట్రూప్ సారథ్యంలో వీణా, వయోలిన్ విద్వాంసులు, డి.శ్రీనివాస్, పవన్‌సింగ్, మృదంగ కళాకారుడు రామకృష్ణ ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలతోనే పార్టీ పటిష్టం

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- వరంగల్‌లో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు ప్రారంభం



సీపీఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

న్యూశాయంపేట: ప్రజా ఉద్యమాలతోనే పార్టీ పటిష్టమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడి ప్రజలకు కమ్యూనిస్టులు గుర్తుకు రావాలన్నారు. కమ్యూనిస్టుల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు విశ్వసించాలన్నారు. గురువారం సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు హనుమకొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత హరిత హోటల్ ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని డి.రాజా ఆవిష్కరించారు. అనంతరం సమితి సమావేశం ప్రారంభించారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ప్రారంభమైన సమావేశాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంత్‌రావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం డి. రాజా మాట్లాడుతూ దేశంలో వేగంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించారు. మతవాద, పెట్టుబడిదారి శక్తులు తీవ్రంగా చొచ్చుకొస్తున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొని సమ సమాజాన్ని నిర్మించేందుకు కమ్యూనిస్టులు కూడా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం విద్యార్థి, యువత, కార్మిక, కర్షక, మహిళ తదితర అన్ని వర్గాలను రాజకీయంగా చైతన్యవంతం చేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ అందరికీ అందేలా చూడాలని, ఇలాంటి విషయాలపై ప్రజావ్యతిరేకత కూడగట్టుకోవద్దని మిత్రపక్షంగా తామ సూచనలిస్తమన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 19 వరకు తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాల్లో పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు, పశ్య పద్మ, బాగం హేమంతరావు బాలమల్లేశ్, కలవేణ శంకర్, బాల నర్సింహ, బోస్, విజయసారథి, కర్రె భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నేతలు, ప్రముఖులకు సీపీఐ సంతాపం..

ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన సీపీఐ నేతలు, ప్రముఖులకు పార్టీ రాష్ట్ర సమితి సంతాపం తెలిపింది. హనుమకొండలో జరుగుతున్న నిర్మాణ సమావేశంలో ఈ మేరకు హేమంతరావు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

క్రమశిక్షణతో లక్ష్యం సాధ్యం

- ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి
- సుమతిరెడ్డి కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వరదారెడ్డి

హసన్‌పర్తి : క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగిస్తే లక్ష్యం సాధ్యమని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి అన్నారు. నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరదారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు పట్టుదలతో చదివితే భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థిని పారిశ్రామికవేత్తగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇండియా క్యాంపస్ లీడ్ వర్చుసా హెచ్.ఆర్ డి. అభిషేక్ మాట్లాడుతూ సమాజంలో అపరిష్కృత సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలు అన్వేషించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచాలి

- కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగేలా ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి కోరారు. గురువారం కేయూ పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో నిర్వహించిన కేయూ పరిధిలోని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్‌బోర్డుకు ప్రత్యేకత ఉందన్నారు. స్పోర్ట్స్ క్యాలెండర్, ఇంటర్‌కాలేజియేట్ క్రీడాపోటీల నిర్వహణ, వివిధ టోర్నమెంట్లకు హాజరయ్యే క్రీడాకారులు, విజేతల వివరాలు ఎప్పటికప్పుడు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్ మాట్లాడుతూ స్పోర్ట్స్ క్యాలెండర్‌కు అనుగుణంగా క్రీడలు నిర్వహిస్తామన్నారు. కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య మాట్లాడుతూ కేయూపరిధిలో నిర్వహించే క్రీడలకు సంబంధించిన బడ్జెట్ వివరాలు తెలపాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఫిజికల్ డైరెక్టర్ జె. సోమన్న మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్‌లో వివిధ క్రీడలకు సంబంధించిన ప్లేగ్రౌండ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కిట్స్ రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించబోయే వివిధ టోర్నమెంట్ల వివరాలను ముందుగానే సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు లిఖితపూర్వకంగా తెలపాలన్నారు. ఫిజికల్‌డైరెక్టర్ సావిత్రి మాట్లాడుతూ క్రీడాకారిణులకు మహిళా కోచ్‌లు, మేనేజర్లకు వేర్వేరు వసతులు ఇవ్వాలన్నారు. అనంతరం కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ వై. వెంకయ్య, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ భాస్కర్, ఎస్.కుమారస్వామి మాట్లాడారు. కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్పీఎం షెడ్ సిబ్బందికి శిక్షణ

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: ఎస్పీఎం షెడ్ సిబ్బందికి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సంస్థ పరిధిలోని జిల్లాల నోడల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఎమ్మార్టీ డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ల వారీగా పని తీరు సమీక్షించి మాట్లాడుతూ ఎస్పీఎం షెడ్లలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎస్పీఎం షెడ్లలో నాణ్యతాప్రమాణాలతో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయాలని సూచించారు. సబ్‌స్టేషన్లను ప్రొటెక్షన్ టీంలు తరచూ తనిఖీలు చేపట్టి సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ కాకుండా డబుల్ ఎర్తింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, అశోక్, జీఎం అన్నపూర్ణ, డీఈలు ఉపేందర్, కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నా..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ డాక్టర్లు

ఎంజీఎం : కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ వరంగల్ ఎంజీఎం ప్రధాన గేట్ వద్ద జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు చేస్తున్న నిరసన శిబిరాన్ని గురువారం సందర్శించి ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన అత్యంత హేయమని, బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలన్నారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఈ ఘటనపై అవకాశమున్న అన్ని వేదికలపై ప్రశ్నించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్యకు జూనియర్ డాక్టర్లు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

వరంగల్ ఏసీపీ వేధింపులు

- సార్ వద్దకు వెళ్లి లావాదేవీలు సెటిల్ చేసుకోవాలని బెదిరింపులు
- కొత్తవాడకు చెందిన వృద్ధ దంపతుల కన్నీటి పర్యంతం



కుమారస్వామి, వసుంధర దంపతులు

వరంగల్ : అమెరికాలో జరిగిన లావాదేవీలు సెటిల్ చేసుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ వేధింపులకు గురి చేస్తున్నారని కొత్తవాడ 80రోడ్డు సమీపంలో నివాసముంటున్న వృద్ధ దంపతులు అంకం కుమారస్వామి, వసుంధర కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ అమెరికా న్యూజెర్సీలో తమ రెండో కుమార్తె, అల్లుడు అమెరికన్ సిటిజన్లుగా జీవిస్తున్నారని, ఈ క్రమంలో అక్కడే ఉంటున్న హైదరాబాద్‌కు చెందిన మన్నెం రమణ తెలుగు వారితో కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయనతో పరిచయమైందన్నారు. వారి మధ్య స్నేహం ఏర్పడంతో తమ కుమార్తె వద్ద రూ. కోటి అప్పు తీసుకుని ప్రామిసరి నోట్లు రాసివ్వడమే కాకుండా మరో రూ. కోటి అమెరికాలో బ్యాంకుల్లో రుణం తీసుకుని మన్నెం రమణ తన కంపెనీలో తమ కుమార్తె, అల్లుడిని భాగస్వామ్యులుగా చేర్చారని తెలిపారు. అయితే కంపెనీకి నష్టాలు రావడంతో పెట్టుబడి పెట్టిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో వారు ఒత్తిడి చేశారన్నారు. ఈ ఒత్తిళ్లు తప్పించుకునేందుకు మన్నెం రమణ విమానంలో ఇండియా వచ్చే క్రమంలో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో గ్రీస్‌లో దింపారన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆయన భార్య గీత.. గ్రీస్‌కు వెళ్లి చికిత్స చేయించినా రమణ మృతి చెందాడన్నారు. ఫలితంగా కంపెనీపై తీసుకున్న రుణాల భారం తమ కుమార్తెపై పడిందన్నారు. దీంతో తమ కుమార్తె పేర ఉన్న ఇంటిని అప్పగిస్తామని, అప్పుల సంగతి మీరే పరిష్కరించుకోవాలని చెప్పినా గీత వినలేదన్నారు. ఈ గొడవ కారణంగా తమ కుమార్తె తమ ఇంటికి వచ్చిందన్నారు. ఈ క్రమంలో శనివారం మట్టెవాడ పోలీసులు తమ ఇంట్లో సోదాలు చేసి తమను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారని తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లగా అక్కడ రమణ భార్య గీతతో మరో తొమ్మిది మంది ఉన్నారన్నారు. వారి ఎదుట ఏసీపీ ఇష్టానుసారంగా మాట్లాడని తెలిపారు. మురళీ సార్ దగ్గరకు వెళ్లి సెటిల్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యారు. ఈవిషయంపై ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపిని వివరణ కోరగా తన కుమార్తెతో పాటు అంకం కుమారస్వామిపై గీత ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నిమిత్తం విచారణ కోసం ఈ వృద్ధ దంపతులను పిలిపించామన్నారు. వారి కుమార్తె వరంగల్ వచ్చాక అమెరికాలోని ప్రాపర్టీలను అమ్మిన వివరాలు తమకు అందించలేదన్నారు. మీడియాలో చూపించిన ఆధారాలు తమకు అందిస్తే న్యాయం చేస్తామని ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

టెలికాం రంగంలో భారత్ రెండోస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ రావు

కాజీపేట: ప్రపంచంలో టెలికాం రంగంలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని ట్రాయ్ కాగ్ సభ్యుడు రావూరి ప్రభాకర్ రావు అన్నారు. కాజీపేట ప్రభుత్వ సాంకేతిక పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో షేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్న టెలికాం శాఖను ప్రజలు ఆదరించాలని కోరారు. 1997లో టెలికాం వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం టెలికాం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా యాక్ట్ తెచ్చినట్లు గుర్తుచేశారు. సమావేశంలో ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్ రావు బీఎస్ఎన్ఎల్ డీఈ రామ్మోహన్, ట్రైనింగ్ ఆఫీసర్ అనిల్‌కుమార్, వెంకన్న, వాసిర్, వృషాలి, మహేశ్, గీతా మేథేయి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

3 Bed Room Flat in GMR Brindavan, Waddepally, 5th Floor & Car Parking, Available Rent. Ph: 9849123115. [SCA24000184]

SERVICES

FINANCE SERVICES

సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై & రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు ఇప్పించబడును. సిబిల్ ప్రాబ్లం ఉన్నా చేయించబడును. 9666142226. [W-1239845]

CHANGE OF NAME

I, the undersigned SEETHA VENKATESHWARLU (New Name) previously called SEETHA VENKATESHWARULU (Old Name) and residing at H.No.4 -7-182, Kumarpalli, Hanumakonda mandal, Hanumakonda dist - 506001, Telangana state, India and solemnly declare. [W-1239848]

BUSINESS OFFER

మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

BUSINESS OFFER

ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9810515624, 8800496710. [G-2157]

WANTED

మా ఆఫీస్‌లో పని చేయుటకు Telecallers, Receptionist, Management Accountant, Field Works అర్జెంట్‌గా పురుషులు/స్త్రీలు కావలెను. సంప్ర॥ 7382323126. [W-1239846]

మా IFB పాయింట్ మహబూబాబాద్ నందు పని చేయుటకు ఇంటర్ / డిగ్రీ చదివిన వారు కావలెను. మహబూబాబాద్ వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సెల్: 9391325192. [M-12256]

శివకార్తికేయ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్, పిల్లలను చూసుకొనుటకు, ఇంటి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి +భోజనం,జీ:18K. 9912011499, 9912011899 [H-796270]

WANTED TEACHERS (PET)

Wanted Trained / Un trained PET Male or Female. Unique High School, Christian Colony, Warangal. Beside SBH. Cont: 9948039640, 7396135390. [W-1239847]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.